

మనుషుల అవసరాలను కూడా సరిగ్గా పట్టించుకోని కాంగ్రెస్.. పశువుల గోడును విన్న సందర్భమే లేదు. పల్లె బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మిన కేసీఆర్.. గ్రామాల పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ చేశారు. పశువుల బాగోగులు చూసుకునే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2017 నుంచి సంచార పశు వైద్యశాలలను నిర్వహిస్తున్నది. దీనిద్వారా ఇప్పటివరకూ 30 లక్షల పశువులకు ఉచిత వైద్య సేవలు అందాయి.

**ముందుకు పోదామా! ఎన్కకా!!**

## మంద పెరిగి మంచిగుంటున్నం

**పదేండ్ల** కింద దాంక.. గొర్లకు బీమారొస్తే మందకు మందే సచ్చిపోయేది. వాటి రోగాలకు మందులొచ్చినయ్. టీకాలొచ్చినయ్. అట్లయినా మాకు తిప్పలు తప్పలే. ఆ మందుల కోసం మందని దవాఖానకు తీస్కపోవాల్నంటె చానా తిప్పలయితుండె. మందులు తెచ్చుకున్నా మాకు మేలు లేకుండె. మందు ఎక్కువైతే గొర్లు సచ్చేది. తక్కువైతే రోగం తగ్గక సచ్చేది. ఒక్కోపాలి టైమ్ దాటిపోయినంక మందులేస్తె పైసలు దండగయ్యేది. ఎన్ని బాధలువడ్డమో? ఎన్ని అప్పులు చేసినమో? మందకు మాయ రోగమొస్తె ఒకదాని ఎనక ఇంకోటి పడిపోయేది. అప్పట్ల నోరు ఆసిలి వచ్చి మందల చానా గొర్లు సచ్చిపోతుండె. ఇప్పుడట్ల లేదు. మూడు నెలలకు ఒకపాలి డాక్టర్లే వచ్చి టీకాలేస్తున్నరు. మందు తాపిచ్చి పోతున్నరు. ఎనకటి ఇబ్బందులు లేకుండ పోయినయ్. మంద పెరిగి మంచిగుంటున్నం. కేసీఆర్ సార్ పైసల్లేకుండనే 20 గొర్లు, ఒక పొట్టేలు ఇచ్చిండు. ఆ మందని మంచిగ పెంపు జేసుకుంట బతుకుతున్న. సాలుకు 20 సనుగులకు తక్కువ గాకుండ అమ్ముతాన్న. మూడేండ్ల సంది మా గొర్ల కాపర్లకు మంచిగున్నది. పావలా బేడ దాసుకుంట లక్ష రూపాయల అప్పు తీర్చిన. ఆరు గదుల ఇల్లు కట్టిన. ఈ సర్కారే ఉండాలె. మా మంద ఇట్లనే పెరగాలె.

• దాడి మల్లయ్య, రామకృష్ణ కాలనీ, తిమ్మాపూర్ మండలం, కరీంనగర్ జిల్లా





హైదరాబాద్ | బుధవారం 22 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com



### కాంగ్రెస్ గొర్రెలకు తెల్వలే!


గొర్రెలంటే ఈ కాంగ్రెస్ గొర్రెలకు తెల్వలే!! 2014లో 650 లారీల గొర్రెలు మన రాష్ట్రానికి దిగుమతి అయితుండే! మనతాన గొల్లవాళ్లు లేకనా? అంతకు ముందున్న పాలకులకు బుర్రలేక! వాళ్ల కులవృత్తిని కూలగొట్టి గొర్రెలను ఇంపోర్ట్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ దుస్థితిని దూరం చేయాలని 65 లక్షల గొర్రెలను పంపిణీ చేసినం. వాటికి 35 లక్షల గొర్రెలు పుట్టినయ్! రాబోయే కొద్దిరోజుల్లో బలమైన గొల్ల, కుర్మలు దేశంలో ఎక్కడున్నరని అడిగితే.. తెలంగాణలో అన్న పేరు మనకు రాబోతున్నది.

▪ కేసీఆర్

ఎటమటం!

### ఎంత బాగా చెప్పారు.. మా తల్లే!

**'మనవాళ్ళు** ఒట్టి వెధవాయిలోయ్' అని కన్యాశుల్కంలో గిరీశం అంటాడు. బహుశా గురజాడ ఈ డైలాగ్ రాసింది ఐటీ అధికారులను ఉద్దేశించి అయి ఉంటుందని అనిపించేలా ఉంది. మాజీ లేడీ టైగర్ రేణుకా చౌదరి తాజాగా ఐటీ అధికారులను ఉద్దేశించి 'మరీ ఒట్టి ఎర్రి బాగుల వెధవల్లా ఉన్నారు' అని చేసిన వ్యాఖ్య సూపర్ డూపర్‌గా పేలింది. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రయోగిత ఐటీ అధికారులు, బీజేపేతర అభ్యర్థుల ఇండ్లపై వరుస దాడులు చేస్తున్నారు. ఆ సందర్భంగా ఎన్నికలలో పంచడానికి దాచిన డబ్బులు ఎక్కడ పెట్టారంటూ... బీరువాలలో చీరల దొంతరలను వెతుకుతున్నారు.



ఆడవాళ్లు ఎంతో కష్టపడి పేర్చుకున్న చీరల వరసలను చిందర వందర చేస్తే వాళ్లు ఊరుకుంటారా... చిర్రెత్తి పోరూ?! అందుకేనేమో రేణుకా చౌదరి ఐటీ అధికారులపై ఒంటికాలి మీద లేచింది. 'ఎర్రి బాగుల వెధవలు మమ్మల్ని తక్కువగా అంచన వేశారు'.. 'మరి పిచ్చి వెధవలు కాకపోతే ఏంటీ? మీరు వచ్చాక అప్పగిద్దామని ఇళ్లలో నోట్ల కట్టలు పెట్టుకొని కూర్చుంటామా?.. మీరొచ్చి రైడ్ చేయగానే దొరకడానికి? మమ్మల్ని చాలా తక్కువ అంచనా వేశారు..' అంటూ మండిపడ్డారు. నిజమే, ఐటీకి సమర్పించిన లెక్కల్లో ఏమైనా తేడా ఉంటే, దాని ఆధారంగా తీగలాగితే డొంక కదిలే అవకాశం లేకపోలేదు. అంతే కానీ, ఎవరి ఇంటిపై దాడి చేయాలని బీజేపీ ఆఫీసులో అందించే పేర్ల ఆధారంగా రైడ్ చేస్తే ఇలాంటి తిట్లు తప్పవు. ఏమన్నా అంటే అన్నారంటారు కానీ...కాస్త అప్‌డేట్ కండి భాయ్‌సాబ్!

• వెల్జాల

ఖుల్లం ఖుల్లా

కరువులోకి తోసింండ్రు
బతుకు బరువు చేసింండ్రు
చేతులూపుతూ అస్తుండ్రు
చెయ్యిచ్చి పోతరు

సమజ్ జేసుకోండి జర
సవాలు తీసుకోండి మల్లా
దగుల్బాజీ దొంగలను
పారదరిమి పంపుండ్రి

... దండమూడి శ్రీచరణ్



# రాంరెడ్డి బోర్లు పొంగినయ్

ఉమ్మడి రాష్ట్రంలో చీకటి రాజ్యమేలింది. కరువు తాండవం చేసింది. నేలతల్లిని గోసపెట్టి తూట్లు పొడిచినా.. చుక్కనీరు పడకపోవు. సన్నకారు రైతులు దిక్కు దివాణా లేకుండా వలసపోతే.. పాతిక ఎకరాల ఆసాములు కూడా అప్పుల్లో కూరుకుపోయిన్రు. పట్టుబట్టి బోర్లు వేసినా.. జల పుట్టిందీ లేదు, పాలకులకు జాలి కలిగిందీ లేదు. అలాంటి కల్లోల కాలానికి సాక్షి నల్లగొండ జిల్లా రైతు బైరెడ్డి రాంరెడ్డి. వంద బోర్లు వేసిన 30 ఎకరాల భూస్వామి 'బోర్ల రాంరెడ్డి'గా మిగిలిపోయాడు. ఇన్ని బోర్లు వేసినా తన పంటలను కాపాడుకోలేకపోయాడు. అదే రాంరెడ్డి.. తెలంగాణ వచ్చాక 'మా బోర్లు పొంగుతున్నయ్' అంటున్నాడు.

'నాడు నీళ్ల కోసం, కరెంటు కోసం గోస తీరింది. సమైక్య పాలనలో కరెంట్ వస్తే ఆశ్చర్యం.. ఇప్పుడు పోతే ఆశ్చర్యం. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే రైతులు ధీమాగా ఉన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, పుష్కలంగా నీళ్లు వస్తుండటంతో వ్యవసాయం పండుగలా మారింది' అంటున్నారు అదే బోర్ల రాంరెడ్డి. గతంలో సాగునీరు, కరెంటు కోసం పడ్డ తిప్పలు.. నేటి పరిస్థితులపై 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు.ఆ వివరాలు ఆయన మాటల్లోనే

- 100 బోర్లు వేసినా నీళ్లు చూడని రైతు
- ఎకరాలకు ఎకరాలు పడావ్
- నేడు దండిగా నీళ్లు.. మెండుగా సాయం
- కేసీఆర్‌తోనే రైతులకు ధీమా
- 'నమస్తే'తో బోర్ల రాంరెడ్డి

**నా** కథ తెల్వనోడు తెలంగాణల లేడనుకుంటా! ఎన్నిసార్లు చెప్పినా నాకూ బోరు కొట్టది.. మీకూ బోరు కొట్టది. వంద బోర్లు వేసిన చరిత్ర కదా నాది! మాది నల్లగొండ మండలంలోని ముషంపల్లి. నా అసలు పేరు బైరెడ్డి రాంరెడ్డి. నాకు 30 ఎకరాల భూమి ఉన్నది. 1990ల కాలంలో 20 ఎకరాల్లో బత్తాయి తోట వేసిన. నీళ్ల సౌలత్ లేక, కరెంట్ సక్కగ రాక 10 ఎకరాలు ఉట్టిగనే పడావు పెట్టిన. అప్పట్లో విపరీతమైన కరువు వచ్చింది. బత్తాయి చెట్లు ఎండిపోవట్టినయ్. ఎదిగిన కొడుకు సచ్చిపోతే ఎంత బాధ అయితదో.. ఏండ్లకేండ్లు సాదిన చెట్లు ఎండిపోతుంటే అంతే బాధ కలుగుతది. తోటలకు పోయి ఏడ్చేది. చేసేదేమీ లేక అప్పులు తెచ్చి మరీ బోర్లు వేసిన. అన్ని బోర్లు దాదాపు 500 అడుగుల లోతు వరకు దించినా.. సుక్క నీళ్లు రాలే. గ్రామంలో అందరం వేసినం కానీ.. నేను మాత్రం 100కు పైగా వేసిన. అయినా ఫలితం రాలే. చుక్క నీళ్లు పడలే! చివరికి ఎట్లయిందంటే.. మా ఊర్లకు బోరుబండి రాంగనే మా ఇంటికే వచ్చిందనేటోళ్లు. అట్లా నా పేరు కాస్తా బోర్ల రాంరెడ్డిగా మారింది.

**మా** ఊర్ల కిస్మత్ చక్కగ లేదని మా పక్క ఊరు వెలుగుపల్లిలో ఐదారు బోర్లు వేసిన. జరన్ని నీళ్లు పడ్డయ్. అక్కడి నుంచి ట్యాంకర్‌లో నీళ్లు తెచ్చి.. బత్తాయి చెట్లను కాపాడుకునే ప్రయత్నం చేసిన. ట్యాంకర్ల మంచినీళ్లు తెచ్చుడు ముచ్చట ఎరకగని, ఇట్ల పొలానికి నీళ్లు పట్టనీకి కూడా ట్యాంకులు వాడినా అంటే అప్పుడు ఎంత దరిద్రం ఉండేటిదో ఊహించుకోవచ్చు. నీళ్లు వడ్డ బోర్లు అయినా సక్కదనం ఉండేటియా అంటే అదీ లేదు! కరెంటు ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో తెల్వకపోవు. రాత్రంతా పొలం దగ్గర్నే పండుకునేది. కరెంటు వచ్చినా.. గంటసేపు ఉండకపోవు. పాతికేండ్లు ఇదే సావు!

**తెలంగాణ** ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు నా తిప్పలు తెలిసినయ్. 'మా తెలంగాణ రైతు ఇంత బాధపడాల్సిన అవసరం ఏంటని'.. ఆ రోజుల్లోనే నా చరిత్రను రికార్డు చేసి అప్పటి ప్రభుత్వాల ముందు పెట్టిండు. నాపై డాక్యుమెంట్ చేయించిండు. 'సాగునీళ్లు సక్కగ ఇయ్యక మా రైతును గోస పుచ్చుకుంటున్నరు.. ఒక రైతు వంద బోర్లు వేయడమేంటి? సమైక్య పాలకులు మా నీళ్లు దోచుకుంటున్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో మా వాటా మాకు ఇవ్వకుండా గుంజుకుపోవడం వల్లే మా రైతులకు ఇన్ని తిప్పలు'



కేసీఆర్‌తో బోర్ల రాంరెడ్డి

అని కేసీఆర్ అప్పటి ప్రభుత్వాన్ని నిలదీసిండు. సమైక్య పాలనలో తెలంగాణకు వాటా ప్రకారం నీళ్లు ఎన్నడూ రాలే. ఏనాడూ రెండు పంటల కోసం లెఫ్ట్ కెనాల్‌కు నీళ్లు ఇచ్చింది లేదు. నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని గుర్తించి అప్పటి నుంచి కేసీఆర్ నిర్వహించిన ప్రతి సమావేశం, పాదయాత్ర, సభల్లో నేను పాల్గొన్నా. ఆయన వెంట నడిచా.

**కొట్లాడి** సాధించుకున్న తెలంగాణకు ఉద్యమకారుడే ముఖ్యమంత్రి కావడంతో సాగర్ జలాల్లో మన వాటా మనకు దక్కింది. మన నీళ్లు మనకు వస్తే బీడు భూములన్నీ పచ్చని హారంగా మారుతాయని సంకల్పించిన కేసీఆర్ పుష్కలంగా నీళ్లు తెచ్చిండు. కాలం కూడా మంచిగైతుంది. హైదరాబాద్ తాగునీరు, పొలాలకు సాగునీరు పోను పుష్కలంగా నీళ్లు మిగులుతున్నయ్. నీళ్ల కోసం దేవులాట లేకుండా పోయింది. తెలంగాణ వస్తే చీకట్లు కమ్ముకుంటయని కొందరన్నరు. ఆర్నెల్లు జర్రంత తిప్పలైంది. తర్వాత కరెంటు కష్టంలేకుండా మాయమైంది. అప్పట్లో కరెంటు వస్తే వింత.. ఇప్పుడు పోతే వింత! మాకు (రైతులకు) కరెంటు ఇయ్యనీకి ఆ మహానుభావుడు.. ఏం తిప్పలపడ్డడో ఏమో! అధికారులకు ఏం చెప్పిండో కానీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల్లోనే కరెంటు సమస్య పోయింది. గిప్పుడు కాంగ్రెసోళ్లు చెప్తున్నట్టు మూడు గంటలు కాదు.. 24 గంటలు కరెంటు ఇస్తున్నడు. కేసీఆర్ రైతులకు ఇచ్చిన ఇనాం ఇది.

**రైతుకు** కావాల్సింది రెండే.. సాగునీరు, కరెంటు. ఈ రెండు సమృద్ధిగా ఉన్నాయంటే మాకు ధీమా. ఇయ్యాల రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.10 వేలు పెట్టుబడి సాయం అందుతున్నది. రైతులు కాలం చేస్తే.. ఆ కుటుంబం ఇబ్బందులు పడకుండా 10 రోజుల్లోనే రూ.5 లక్షల బీమా వస్తున్నది. ఇంకేం కావాలి రైతులకు. గ్రామగ్రామాన ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నయి. ధాన్యం పైసలు 48 గంటల్లోనే రైతుల ఖాతాల జమయితున్నయి. నా చిన్నతనం నుంచి గిట్ల ఎన్నడూ చూడలే! నీళ్లు ఇచ్చిండు, విత్తనాలు ఇచ్చిండు, పెట్టుబడి ఇచ్చిండు, కరెంటు ఇచ్చిండు. ఇప్పుడు 15 బోర్లు ఫుల్లుగా పోస్తున్నాయి. 10 ఎకరాల్లో బత్తాయి తోట ఉంది. 20 ఎకరాల్లో వరి పొలం వేసిన. సీఎం కేసీఆర్ పాలనలో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. కేసీఆర్ పాలన రైతులకు ధీమా కల్పిస్తున్నది. కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ ఖతమే! కరెంటు ఆగమైతది. రైతులు బద్నాం అయితరు. కేసీఆరే వస్తే.. మా రైతుల బతుకులు మరింత మంచిగైతయ్!!

... పోగుల రమేశ్






**బాలానగర్ ఫ్లై ఓవర్ @ 3 ఏండ్లు**

హైదరాబాద్ నగరంలో ఆరు వరుసలతో నిర్మించిన తొలి ఫ్లై ఓవర్‌గా బాలానగర్ వంతెన పేరు గాంచింది. తెలంగాణ సర్కారు దీనిని మూడేండ్లలో నిర్మించింది. కరోనా సంక్షోభం తలెత్తకుంటే ఏడాదిలోనే పని పూర్తి చేసేవాళ్లమని అధికారులు తెలిపారు.



**తెలుగుతల్లి ఫ్లై ఓవర్ @ 9 ఏండ్లు**

అప్పటి టీడీపీ హయాంలో ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి 9 ఏండ్ల సమయం పట్టింది. నిర్మించిన ఐదేండ్లలోనే వంతెన మొత్తం మరమ్మతులు చేయాల్సిన దుస్థితి దాపురించింది. సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరిగినట్టు తేలింది.

థౌజండ్ వాలా..

